# సీనయ్య

మ్యాదర బాలయ్య పుట్కలు , ఎంతసుతారంగ అల్లుతడంటె అంత సుతారంగ అంట ఆసుట్ట నాల్గూళ్లకు పేరు వోయిండు. బాలయ్యకు సేతుల ఎంతవొడ్పు వుండదో కడ్పులగుడ అంత మెత్తనవుండది. బాలయ్య వాళ్ల అన్న లింగన్న గల్నే ఉంటరు. అంత గానం ఏముండదని పెద్దేర్లు వడ్తరుగని, కుండేరువడి ఎవరి సారెడు వాళ్ల ఉడ్కవెట్టుక తినకుండ ఒక్కకాణ్ణె కాపిరెం జేస్తుండరు. బాలయ్య ఎదమెత్తనకు దగ్గట్లె ఆయిన పెండ్లాంగుడ అంబ్యాద అడివె. అందికె సేతి నేర్పు తోటి సంపాయించిన సొమ్మంత లింగన్న , లింగన్న పిల్లలు పీక్కతింటుండిరి.

ఇట్లుండంగ ఎకాఎకిన గత్తర గొట్టి బాలయ్యను గద్ద దన్నుక వోయినట్ల సావు సంకన వెట్టుకపోయింది. ఆనాటికి బాలయ్యకు ఒక్కడే కొడ్కు తొమ్మిదేండ్లోడు. తల్లి ఎడ్డిది మొగుడు వోయినంక ఏడ్సేడ్సి భూమి బట్టి, పిలగాడు ఆగమైతడని అందరనంగి గుండె దైర్నం దెచ్చుకోని బావ కాడ్కి వోయి ,''బావ మీ తమ్ముడేమొ వాయె, ఇంగ ఇంటి కంతటికి గీ మొల్క ఒక్కడెగద ? ఆర్తం, ప్రాణం అంతసీదె; వీణ్కి వో వానరు జూపి బత్కుదెర్వ నేర్పు, తొడ్మె ఎండిన పిందోలె నూనెలేని దీపమోలె నేను ఎప్పుడు పుట్కుమంటనో, ఆర్తనా? దెల్వదు అంట పిల్లగాణి సేతిని లింగన్న సేతుల వెట్టునికె వోతె, లింగన్న మొకమంత వొట్టిశాపలు దిన్న పిల్లి తీర్గ వెట్టుకోని, సీదరిచ్చుకుంట పోరణి సేయి ఆవలకు నూకి'' సాయమ్మ ! బాగుండదమ్మవొరుస; నేను అడ్వికి వోయి గడ్డిగాదం సార్క, తీగె, అంట దెస్తె నీ మొగడు ముద్దుగ ఇంట్ల నీడ పట్టున కడ్పుల సల్ల గదులకుండ గూసోని ఆడుకున్నట్ల రొండు గంపలో, సాపలో తడ్కలో అల్లితె వొచ్చిన కాడ్కెసాలంట ఇన్నాండ్లు మీ ముగ్గురికి పొట్టా బట్ట సడ్పితి, ఇంగ వాణ్ణే గత్తర గొట్కపోయినంక గుడ దినవారం జేసి రొణ్ణెల్ల నుండి కూసోవెట్టి మీ ఇద్దర్ని నడ్పుతుండ. ఇంగ యా మొకం బెట్టుకోని నన్ను సాకమంటుండవు ? అమ్మో ! ఏమో అనుకున్న నోరులేని దయ్యం వూరార్పిందంట ! ఇంగో గడిసేపు నాయింట్లుంటె నాకు ముప్పు దెస్తవ్, నడువ్'' ఇంట్లకెళ్లి అంట తల్లి కొడ్కు ఇద్దర్ని

మెడవట్టి ఆవలికి దొబ్బి తలుపులు బిగిచ్చుకున్నడు. పెండ్లాం ఎంకటమ్మ ఎన్కకెళ్లి మిట్కిళ్లిరిసింది.

సాయమ్మ వో అంట ఏడ్సుకుంట కొడుక్కను ఎంటవెట్టుకోని అన్నగారిల్లు ద్యావరకదిరెకు వోయింది, బుడానికి బుడం బీక్కోని నెత్తిన వెట్టుక వొచ్చినట్లవొచ్చిన సెల్లెను జూసి కడ్పుల దేవి నట్ల గాంగ ప్రాణవార్తికంగ ఇంట్లకు పిల్సుకోని అతి గతి అంట జూసిండు, ఆయిన పెండ్లం రామమ్మ గుడ నెత్తి మాసి తన కడ్పుజొచ్చి వొచ్చిన ఆడి పిల్లను మ్యానల్లుణ్ణి కడ్పుల వెట్టుకోని యాళ్ల పాళ్లన్నది ! ఉన్నంతల కలోగంజో? వోసి సాకింది.

సాయమ్మ కొడుకు మ్యానమామ ఇంటికొచ్చి ముప్పొటలు మెక్కి బొంగు రాలాడి, గిల్లి దండాడి, గిల్లికయ్యాలు వెట్టుకుంట తుల్వసోపతిల గడ్పలేదు. జిన్నారం గట్లల్లకు వోయి తుంగ గడ్డి, సీకెర తీగెలు దెచ్చుకోని తండ్రి కన్న ముద్దుగ తీరొక్క నమోనల పుట్కలు, టోపులు, సంచులు అల్ల నేర్సిండు. అది జూసి మ్యానమామ ముర్సుకుంట వాణికి అలాగ వో సిన్నపాటి దుకుణం గుడ వెట్టిచ్చిండు. ఇట్ల సాయమ్మ, సాయమ్మ కొడుకు సీనయ్య ఒగరి సేతికింద నీళ్లు దాగకుండ వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలవడ్కం నేర్చుకున్నరు. మ్యానమామ ను మర్వక ఉడ్కి నీళ్లకు సన్నీళ్లంట తోడైతడు. ఇప్పుడు ఎవ్వరి నోట్ల జూసిన గని సీనయ్యనె మెసుల్తడు. పల్కపైతోటి సెయ్యెత్తు మణిసి, ఆఎత్తరితనానికి వయిసు వన్నెవెట్టంగ ముద్దుగ మీసం కట్టొచ్చి, ఉంగురాలు జుట్టుకున్న బాలు పణమీద వాలంగ దుకాండ్ల గూసోని అమ్ముతుంటె అందరికండ్లు ఆపిలగాణి మీదనె ఉండేవి.

ద్యావరకదిరెల పేర్వోయిన కాపోండ్లందరు. వాండ్లల్ల జంగం బుచ్చిరెడ్డి కొడుక్కు గట్ల సాదరి పల్లె ఆనిమిరెడ్డి బిడ్డ ఎర్రమ్మనిచ్చిను. ఆఎర్రమ్మకు లేక లేక వొకొడుకు కొర్న బుచ్చిగాడంట పుట్టిండు. వాడుపుట్టిన గోలె వాణి బుద్ధొల్నె ఎదుగుదల లేకుండ ఆరేళ్లు మూరేళ్లోణోలెవుండి నాసిరకంగ గానొస్తడు. యాదొ సురూపొ, కురూపొ దీపం ఆరకుండ ఇల్లు నిలవెట్ట వొపోరడంట పుట్టిండు గద అంట, తలిదండ్రి తృప్తివడి దోసిళ్లకొద్ది పైకం బోసి సదువులల్ల వెట్ట జూసిండ్రు గని అదివాణికి అబ్బితె గద ? అది అబ్బక వోంగ, తాగుడు, తప్పుడు తిరుగుళ్లు, లంగశాస్త్రలు అలువాటైనవి. ఎర్రమ్మ మర్దికో బిడ్డవుండది. దానిపేరు చంద్రిక. ఆసెంద్రి కమ్మవోసంతనాడు బాట

పోంటినడువంగ రంగుల బుట్లుకంటికి గొట్టి జెరసేపు సూతమంట దుకాండ్లకొచ్చింది. కొంటెసూపు కోడె పాయంతోటి ఎర్రగీతల తెల్లంగి దొడ్గి సీటిబజాయించుకుంట కూసున్న శీనయ్యను జూసి సుర్రు బుర్రు మనుకుంట వోయింది, గని ఈ ముక్కు మీది కోపం శాన్నాళ్లుండ లేదు,'వాణి మిర్ర గుణం వుంటె వాణికుండె' నాకేంది? పటేలు బిడ్డను నాకు బుగులెందుకు ? పైస వారేస్త కొనుక్కుంట నంట మళ్ల వోయి వో పది రూపాలు వెట్టి వోరొండు బుట్టి చిల్కలు గొనుక్కొచ్చింది. ఆసిల్కలు దెచ్చి తనమంచం కాడ యాళ్లడ గట్టు కున్నది. అటెంక శీను తమ ఊరోడెనంట దెలిసింది . ఇట్ల రాంగ రాంగ కోపంగీపం కొండెక్కి శీను పేరు సెవుల వడ్డప్పుడల్ల చెంద్రి కమ్మకు పెయ్యి జల్లు మనుడు మొదలైంది.

మదనయ్య సింగిణి శాతవట్టి ఈరమార ఏకుతున్నట్లె కండ్ల వడ్తుండది. ఈకత ఇట్లుండంగ ఎర్రమ్మ కొడ్కు పాట్టిగింజ ఇల్లు సగం మట్టుకు జళ జళ జేసి వో'చిట్టీల' కంపిని అంట దీసిండు. ఆ ఇంటికి రాకపోకలు గలిస్తె సెంద్రికను జూడ తనకు వీలుంటదని పాపం బుద్దిని నమ్ముకోని వూట సెల్మోలె అది విన్నాణాలు వూరిచ్చుంగ సేతివొడ్పు తోటి ఆ ఆకారాలకు రూపుదిద్దినేనూ వో మిద్దెయిల్లు గట్టు కుంటనని ఎవ్వరికి జెప్పుకుండ రొండు సిట్టీలు 'లక్ష' అయ్యేటట్ల ఏసిండు శీనయ్య.

అవి పండైనంక పైకం ఇయ్యవయ్య బాల్‌రెడ్డి అంట వోతె, ఈ బాల్‌రెడ్డి ఎంతో ప్రాణ వార్తికంగ ఎర్రదస్తురుమాలబుజానేస్కొని అదేంది ? సీను ? ఏందొ అప్పులోడు నిలవడ్డట్ల వాకిట్ల నిలవడ్తివి? రా! లోపటికి, నీ వేం మందివా? పరాయివా ? రా! పల్క మంచం మీద కూసుందవుగని, అంట లోపటికి విల్సుకోని కూసోవెట్టి, చెల్లమ్మ ' చా' వట్టుకరామ్మ, దోస్తువచ్చిండు అన్నడు.

ఆసెల్లె లెవరంటె సెంద్రి'నమ్మనె, 'చా' గిలాస వట్టుకోని వొయ్యారాలు వొలుకంగ సెముటలు వోసుకుంట వొంగి బల్లెపీట మీద వెట్టి సట్కునలోపటికి వోయిన చిత్రం బాల్‌రెడ్డి ఎదలముల్లోలె నాటింది. గని ఈ మ్యాదరోణ్ణి నియువున ఉత్త బత్తల జేసి గండ కత్తెర్ల సొప్పదంటోలె ఇరికిస్తనంట,కండ్ల గమ్మిన నెత్తురు సారలు గాన్రాకుండ 'సీను' చాయె దాగు, అంట కోపు చేతికందిస్తె తనకేందొ మైదు జల్లినట్ల గాంగ వొహ తన దుకాండ్ల కొచ్చి ఏడులోతుల బాయిల వడ్డ బొక్కెనను పాతాళగడిగేసి గుంజినట్ల తన మనుస్సును గుంజిన వొగలాడి ఈయిన సెల్లెలా ? మరి ఈ పటేలేము ? నన్ను సిన్న సూపు

జూడకుండ సరిబరిగ కూసో వెట్టుకునె'' అంట ఆలోచన్న వడ్డమనిషిని మేల్కోల్పి నట్లు బాల్‌రెడ్డి-

సూడు సీను ! ఇవి సేతులు గావు, అంట రొండు సేతులు వట్టుకోని వో ఆర్నెల్లు వొప్కవట్టు నీ రొండు చిట్టీల పైకం పూలల్ల వెట్టి ముడ్ప్లె ముట్టజెప్త అంట గీ మాలిండు, అది ఇని ఏం మాట్లాడాలెనో తోచక నిల్వురాయి వడ్డట్లె 'సూడు పటేల మళ్ల వమాట దప్పకు, వమాయువ్మకు దెలిస్తె నెత్తిన నోరు వెట్టుకోని అబ్బరిచ్చుకుంట ఊరూగేరి ఒక్కటి జేస్తది'' వొస్త అంట వోయిండు సీను. ఎంతటోణ్ణైనగుసులాడదీసి ఎల్లెల్కల ఏసేటివి కాంతా కనుకాలు రొండె.

ఆకాణ్ణుండి సీను , బాల్‌రెడ్డి వున్నప్పుడూ లేనప్పుడు ఆఇంటికాడికి వొచ్చి పోతనే వుండె. అయినగని ఎవ్వరు వట్టిచ్చుకోనట్లు సూసి సూడనట్లు మెదుల్తుండిరి. ఇట్ల సూడంగనె ఆర్నెల్లు గడ్సిపాయె, సీను ఇంగవూకుంటె మంచిదిగాదని, బాల్‌రెడ్డి ! సూడు ! మాట దప్పుతుండవు, ఇదిపైసతోటి మాట, జాంతానంగాదు, నా తోటి బొంకి నీవు నిప్పుతోటి సెలగాట మాడ్తుండవ్ అంట జర గుడ్లురిమ్మి గట్టిగనె బెదిరిచ్చిపోయిండు.

ఈముదనష్టపు బాల్‌రెడ్డి సోపతిల పాపం సీను అప్పుడో ఇప్పుడో జెర సారసుక్కగొంతుల వోస్కసుడు గూడ నేర్సుకున్నడు. గని ఎన్నడు తనకు తాను వోయి కొనుక్కోని తాగలేదు. అసోంటి సెడ్డగుణాల్యావి లేవు. లేవంటజెప్పుడెందుకు, ఉంటె గిన ఏమిలేని శిథిలాలకెళ్లి లేసి ఇంతఎదిగి నిలుస్తాడు ? అందికె సీను కాపాయం మనిషి అంట అందరనుకుంటరు

నిలువెల్ల ఇసం నిండి, అంత పుచ్చి, పురుగాడి తుట్టె పురుగోలె మిగిలిన బాల్‌రెడ్డి, సెంద్రికను ఎరజూపి సీను పైకం దిగమింగి ఉత్త బత్తల జేస్తననుకున్నడు, గని అసోంటి తప్పుడు నడ్త కండ్ల వడలేదు, ఇంగ ఎట్ల ? తప్పిచ్చుకునెవీలులేదు, అరకంట్లం బిగిచ్చినట్ల మాట మాటకు పైకం ఇయ్యి లేకుంటె ఇజ్జత్ దీస్తనంటుండడు, శీను, కలెవడ్డమంటె, కస్రత్ జేసిన పెయ్యి ఇన్ప కడ్డోలె వుండె వాణి ముందల పిస్కోలె నేను సస్తినబ్బో అంట సర్వొడు నీళ్లుదాగుత, దుడ్డిచ్చి గుండగాళ్లను బెట్టమంటె ఇల్లుగాలిచ్చిన వోతులం బంగారం లేకుండ జేస్తె అంట ఆలోచన జేసిండు.

కడాకు ఏం నిర్ణయానికి వొచ్చిండోగని, వోవారం దినాలు యాడ్కివోకుండ, గడ్డి వాములు జూసుకుంట, కరంట్‌మోటరు జూసుకుంట, వైర్లు సుట్టుకుంట, పాత పిలాస్టిక్ బిందెలు సవరిచ్చుకుంట, ఖాలి డబ్బులల్ల గ్యాసు నూనె నింపుకుంట జేరిండు, అట్ల పనిల మునిగిన కొడుక్కును జూసి ఎర్రమ్మ! ఎంకటేశుడా! ఎన్నాళ్లకెన్నాళ్లకు నా పిలగాడుబాయికాడ్కి వోయి, గడ్డి, కుప్ప, సేను, బాయి, బొక్కెన అంట జూస్తుండడు, ఈ బుద్దిని ఇట్లె ఖాయం జేయి తండ్రి అంట దేవుణి అరలకు వోయి సాగిలవడి దండం బెట్టుకున్నది.

శీను సేతుల వొక్కవొనరు గాదు, శనానేర్పులుండవి, శీనుకు ఇంజన్ నడ్పుడు ఎల్క్టేరు పని అంటె కరంట్‌పనిగూడంగ వొచ్చు, అందుకోసం ఆవూళ్ల ఎవరింట్ల ఎకా ఎకిన కరెంటు షాట్ గొట్టిన, బాయికాడ మోటరు చాలుగాక పోయిన అర్దమ్మ రాత్రి ఐనా సరే 'శీను' అంట విలుస్తె సాలు తారిచ్చినట్ల వోయి ఆదుకుంటడు. అందిరితోటి శెబాస్ అనిపిచ్చుకుంటడు.

ఆయాళ్ల కామిని పున్నం! అందరు కుశాలుగ అంతకు ముందు రాత్రి కాముణ్ణి గాల్సిన్రు- తెల్లారి హోలి దులండి అంట రంగులు, గులాలు, బురుద నీళ్లు, కందెన గుడ వోనియ్యకుండ ఒగరిమీద ఒగరు సల్లుకున్నరు, రుద్దుకున్నరు. ఆయాళ్లపొద్దునంత సిన్న పోరగాడు ఆడుకున్నట్ల శీను గుడ దోస్తుల తోటి ఆడ్కోని రొండు ఝాములప్పుడు తిని జెర సేపు కూర్కుదీసి లేసెట్యాళ్లకు దీపాలు వెట్టె పొద్దైంది. ఆయాళ్ల కొడుక్కు ఇష్ట మంట తల్లి సాయమ్మ నూనె వోసి కాకరొడ్డ బియ్యపు పొలావు, కోడికూర జేసింది, ఆయమ్మ కొడుక్కును జూసి 'ఆరి శీనూ! ఈయాళ్ల జెర దబ్బున దిందం బిడ్డ! కూర ఉడుక్కు జేస్త అంట జెప్పిపొయ్యికాడ్కివోయి పొయ్యి రాజవెట్టి గోలిచ్చుకుంట గూసున్నది. కొడుక్కుబాయిమీదకి వోయి తొట్టినీళ్లు జేది కాళ్లు మొకం గడుక్కోని ఇంట్లకొచ్చి, సీటి బజాయించుకుంట తలెలు, రొండు గిలాసలు వెట్టి, గ్యాస్‌నూనె ఎక్కదీపెం ఎలిగిచ్చి 'అమ్మ రావె!' అంట కూతలు వెట్టుకుంట గూసున్నడు. ఆ రంతిని తల్లి సాయమ్మ, కుశివడుకుంట ఈపోరగాణికి అచ్చం తండ్రి పోల్కెలె వొచ్చినయ్, యాదానికి ఆత్రమే! అంట అనుకోని వస్తుండర నాయిన, ఇట్ల ఏగిర్తవడ్తె వచ్చె పెండ్లం ఎట్ల దట్టుకుంటది అంట అంటుండంగనె, బయిట సీను, సీను, అంటవిల్సినట్లైంది, సప్పుడిని తల్లి ఎవరంట వోయి సూసెట్యాళ్లకు బాల్‌రెడ్డి నిలవడివుండడు. ఆయినను

జూసిసాయమ్మ ఏం నాయిన, యాళ్లగానియాళ్లొస్తివి? అంట అడ్గుతుంటె ఏం లేదమ్మ శీను తాన కొంచెం పని ఉండది పిల్సు అన్నడు, తినెటందుకు తలె ముంగల గూసున్నడు బిడ్డ తిన్నంకవొస్తడు, అంటుంటగనె, ఆమాటలిన్న శీను లేసి అంగి దొడుక్కోని ఇప్పుడె వొస్తమ్మ నీవు దిను అంట అనుకుంట బాల్‌రెడ్డి ఎంట నడ్సిండు.

ఇట్లవోయిన సీను ఎంతకు ఇంటికి రాలేదు, తల్లి కండ్లు కాయలు గాసెటట్ల ఎదురు సూసి, ఎదురుసూసి యాసారి ఇట్ల వొర్గిందొ లేదొ? కోళ్లుగూసినయ్- మళ్ల పక్కదుల్పుక లేసి ఆపని ఈ పని జేసుకున్న గని కొడ్కురాలేదు. రాత్రి వెట్టిన కంచాలు దీసి గోలిచ్చిన కోడికూర కంచుడు దింపి పక్కకు వెట్టి కాలు గాల్న పిల్లోలె దిర్గవట్టింది. ఇంత కింతకు పొద్దు నడి నెత్తిన ఎక్కింది, గని కొడ్కురాలేదు.

అంగిదొడుక్కోని ఇవతలికొచ్చిన సీను ను జూసి బాల్‌రెడ్డి కుశాలుగ నగుకుంట, అరె శీను ! నన్ను జూసినప్పుడల్ల నీకు నక్షత్రకునోలె నాపైకం, నాపైకం ! అంటుంటివి గదర ! ముక్కిడిదుడ్డు ఎల్తివోకుండ నీ సొమ్ము నీకు ముట్టజెప్త, నాకు రావల్సిన బాబతు రొక్కం రొండింతలొచ్చింది. ఈయాళ్ల మా సేనుకాడ కర్సు ఇర్గ దావతు జేసుకుందం, అటెంక నీ సొమ్ము దీస్కోని పోదువు గనిరా ! అంట పిలిస్తె నిజమంటనమ్మి ఊరవతలి దాంక వో అరకోశెడు దూరం నడ్సి ఇద్దరు బాయికాడ్కి వోయిన్రు.

ఆడ గడ్డివాము కాడ ముద్దుగ బండేసి దానిమీద బజ్జీలు, కావలిసన కూర, అన్న గుగ్గిళ్లు, రొండు బీరు సీసలు, రొండు రొండు డరాంలు వట్టె ఎమిజాలి సార సీసలు ఉండిన్నవి. ఇద్దరు తొల్త చెరో బీరుసీస అందుకోని ముద్దుగ వూరిమీది ముచ్చెట్లాడు కుంట తాగిన్రు. తిన్నరు, యా అనుమానం రాలేదు. అటెంక అరె ఇది జాల లేదు, జెర ఎమ్జాలని జూతమంట ఒగరి బుజాలమీద ఒగరు సేతులేస్కోని, నగిముర్సు కుంట గూసోని పరాశ్కాలాడుకుంట సీసలందుకున్నరు. తొల్త బాల్‌రెడ్డి వోసీస దీసుకు న్నడు, మిగిల్న సీస శీనయ్య జవురుక తీసుకోని 'సూడు ! బాల్‌రెడ్డి ! నన్నోడిస్త తాగుట్ల ననుకుంటుండవేమొ ? కష్టనిష్టురాలల్ల కాగి రాపిడి దేల్న శరీరం. నాకు నిష అంత దబ్బున రాదు, బక్కప్రాణం నీవు బద్దురం, మల్లావొ కోశెడునడ్సి ఇల్లుజేరవోవాలె అంట అనుకుంట ఆయింత సీస మూతికి వట్టిండు, అందులున్న ఇసం గటగట గొంతు పొంటి కడ్పులకు దిగింది, తనబలాన్ని నమ్ముకోని బీరాలు వల్కిండు గని అంటు సొంటెరుగని మనుసు శీను కేందెల్సు? అందుట్ల తన కండ్లను ఎప్పటికి మూసి, తన పేరు

మాపై మత్తుమందు, పాషాణ మసొంటి నిద్ర గోలీలు నూరిపోసిండని ? బాల్‌రెడ్డి సేతుల వట్టుకున్న సీసను మూతికాడ్కి వోనియ్యకుండ ఒక్కదిక్కు మూతి అదోతీరు వెట్టి, ఇసపునగు నగుకుంట తమాసజూస్తనంట గూసున్నడు.

ఎన్కముందు జూడకుండ పెగ్గెలకు వోయి అపూటం ఎమిజాలి అంట దాగి గుడ్లు త్యాలేసు కుంట న్యాలకొర్గిండు సీను. అట్లొరుగుతున్న శీను ను జూసి కదిలిచ్చకుండ మెల్లెగ లేసి, ఆరలకు నడ్సిండు, దయ్యెం బట్టినట్ల బాలిరెడ్డి; కాదు తానే పిశాచి రూపుకంల వో దయ్యెమోలె బుసకొట్టుకుంట, పాత కరెంటు వైర్లు నాల్గు మూళ్ల పొడ్వు తోటి రొండు దెచ్చిపెట్టిండు. ఇంతట్లకె మొకంగా(న్రాకుండ కొప్పెర వెట్టుకున్న వోమనిషి సుట్టమో ? పక్కమో పనోడోగని కుత్కెదిగంగ కత్తరిచ్చిన పిలాస్టిక్ బిందె వట్టుకొచ్చి ఏక్‌దం న శీను మొకం మీది కెల్లి ఊపిరి వుల్లకుండ గొంతు వుట్టం బిగిచ్చిండు. అటెంక ఇద్దరు గల్సి పదురుకున్నట్లు, ఒగడు రొండు కాళ్లు దగ్గెరికనిపట్టు కుంటె ఇంగోడు ఇర్సి కట్టిండు. కాళ్లు గట్టినంక రొండు సేతులు మీదికి ల్యావట్టి, దండం బెట్టినట్ల జోడిచ్చి బిగ్గగట్టి పాపం సీనయ్యను వోకట్టెల మోపోలె జేసి(న్రు. అటెంక ఏందో పూన్కమొచ్చినట్ల ఇందాక నింపి తయారుగ వెట్టుకున్న గ్యాసు నూనె డబ్బదెచ్చి గడ్డివాము మీద ముద్దుగ గుమ్మరిచ్చి, ఇందాకె కట్టె మోపోలె జేసిన సీనును తలో దిక్కు వట్టుకోని వుయ్యాల వూపినట్ల వూపి, వూపందుకున్నంక గడ్డివాము మీదికి ఇసిరేసి, అగ్గిపుల్ల ముట్టిచి(న్రు. నిప్పుముట్టంగనె ఎండుగడ్డి భగ్గుమన్నది. సుట్టు మంటలు నాల్కెలు కోసుకుంట మొగులుకు ముచ్చెట జెప్తమంట లేసినవి, పిలాస్టిక్ బిందె, కాకకు కర్గి మొకాన్ని ఎత్తొంపులు గా(న్రాకుండ ముద్ద జేస్తె, సుట్టుముట్టిన మంటలు శీనయ్యను కాల్శికొరకచ్చు జేసినయి. నెత్తినీడ వోయిన సాయమ్మకు కడుపు సిచ్చుగూడ కండ్లజూపింది గాశారం.

తెల్లారింది, బాటపొంటి పోయెటోళ్లు కాలి మసి మసి ఐన గడ్డి కుప్ప జూసి, ఆయ్యో ! పటేలోండ్ల గడ్డివాము గాలింది కాలింది, అంట లొల్లి వెట్టి(న్రు, ఒగర్ని జూసి ఒగరు, అంత గుంపు గూడి(న్రు, ఈమాట తాను గుడ తొలిసారిగ ఇన్నట్లు ఉర్కోపర్గో అంట బాల్‌రెడ్డి గుడ బాయి కాడ్కి వొచ్చి, అయ్యో ఎవరొ ? కాలిసచ్చి(న్రు, ఏం ? పాపం జుట్టుకునెనబ్బ ! అంటవోయి పోలీసోండ్లకు టెలిపోనిచ్చి వొచ్చి ఆణ్ణె నిలవడ్డడు. ఇంతట్లకె పోలీసోళ్లు, సర్కులు, అమీన్, జవాన్లు అందరు దిగి(న్రు. సచ్చిన మనిషిని గుర్తువట్టె టట్ల లేదు. ఒక కుడి పాదం, ఎడ్మకాలిపిక్కమట్కు పాయింటు బట్టతున్క

అంటుకోని కాలకుండ కండ్ల వడ్తుండది. పోలీసు పంచనామ మొదలు వెట్టిన్రు, నేనిట్ల ఇంటిదాంక వోయి మళ్లొస్త అంట బాల్‌రెడ్డి ఇంటి మొకం బట్టిండు. ఇంతింత ఈ పుకారు వూళ్లెకు ముట్టింది, కొడుకు ఎప్పుడొస్తడొ అంట ఎదురు తెన్నులు జూస్తున్న సాయమ్మ, కాలింది ఎవరొ ? ఏందొ? సూసొస్తనంట బయిలెల్లింది.

తోవల సాయమ్మను జూసిన బాల్‌రెడ్డి ''యాడ్కివోతుండవమ్మ ? కాలిపొరు కాసైండు, దడ్సుకసచ్చేవ్, ఊకె ఇంటికివో నాకే బుగులైంది ? అన్నడు.

ఆమాటిని సాయమ్మ ఏందో ? నాయిన, నీ ఎంటవోయిన నాకొడుకు ఇంగా ఇంటికి రాలేదు, నాకేందొ ప్రాణమంత మసి మసి వడ్తుండది. బుగులైతుండది అంటె, అదేంది సాయమ్మ ? అప్పుడె అమ్మ ఎదిరిసూస్తది, బువ్వదినలేదంట వొచ్చెగద ? నీకొడుకు సోరోడైండు దబ్బున పెండ్లి జేయి, యాడ్కివోతడు ? వస్తడు ? నేను ఇంటి దాంక వోత అంట వోయిండు.

సాయమ్మ బాయికాడ్కి జేరెట్యాళ్లకె మంది జన జాతరోలె ఉండరు, సుట్టుర పోలీసు పైర వున్నగని, ఈగెలు ముసురుకున్నట్ల ముసురు కున్నరు. మందిలకెల్లి సందు దొరికిచ్చుకోని దగ్గరికి వోయి సూసి, సాయమ్మ, వొణుక్కుంట, అబ్బా ! నాకొడుకు గీ బట్ట పేల్కె అసొంటి పాయింటె దొడుక్కు నిండె నబ్బ, ఏంజేతు ? నాయినా? నీవేనా ? బిడ్డ అంట మొత్తుకునుడు మొదలు వెట్టింది.

ఆమెను ఊకుండుమంట జెప్పి, నీకొడుకుకు ఇంగేమన్న గుర్తులుండయా? అంట అడిగిన్రు, ఆమె తనకొడుకు కుడికాలు బొటనేలుకు గోరు లేదంట సెప్పింది, సూడు సూడు మంట ఆ పాదం కాలకుండ మిగిలి ఉండింది, అదిజూసి కాలిన మనిషి 'సీను' అంట ఖరారు జేసిన్రు. అప్పుడు తల్లి రాత్రి జరిగిన సంగతంత జెప్పి, తోవల గల్సి బాల్‌రెడ్డి తనను ఈడ్కి వోకుండ బెదిరిచ్చి బుగులు వెట్టిండు అంటగుడ జెప్పింది.

అప్పుడు పోలీసోండ్లు బాల్‌రెడ్డి ఇంటికి పొయ్యెట్యాళ్లకు బాల్‌రెడ్డి బస్సెక్కి యాడ్కొ తోకనాం పీకనాం అయిండు, గని, దిక్కులేని సాయమ్మను జూసి, కండ్లల్ల ప్రాణం బెట్టుకోని కొడుకు కోసం బత్కుతున్న సాయమ్మ కడ్పుకోతను జూసి, కట్టు దప్పి తాజెడ్డకోతి వొనమల్ల జెడిపిందన్న కతోలె తయారై సంగాని కంతటికి సెదల పుట్టోలె తయారైన బాల్‌రెడ్డి అసొంటి పిశాచపు గుణాలను రూపు

మాపాలన్న గట్టి నమ్మకమున్న సర్కాల్ సావు పట్టుదల తోటి ఎంబడిచ్చిండు.

తండ్రి, సుట్టాలు అందరు ఎంతైన సరె గుమ్మరిచ్చి కొడుక్కను దక్కిచ్చు కుంద మనుకన్నరు గని, పచ్చనోట్లకు అమ్ముడు వోని సర్కాల్ సాబు ఎంటాడి బాల్‌రెడ్డిని వట్లు కున్నడు.

ఈ దారుణం జేసిన రౌండో మనిషి బాల్‌రెడ్డి జొప్తెదప్ప తెల్వదు- గొ(రెతోలు గప్పుకున్న తోడెళ్లంటవి. బద్దురంగవుండాలె అంట జనం థూ, థూ అన్నరు.

ఇందుట్ల తప్పెవరిది ? సాయమ్మ బావదా? తెల్విలేని సాయమ్మదా? నర రూపుకంల వున్న పిశాచి బరిదెగిచ్చిన బాల్‌రెడ్డిదా? తనవున్కి మర్శి పెద్దింటి పిల్లను కన్నెత్తి సూసిన పాపమా? తనబలం, వొనరు మీద మిక్కిలి నమ్మకం బెంచుకున్న శీనుదా? పైసదా? ఎవరిది? అదీ ఇది గాకుండ సాయమ్మ రాత అంట జెప్పాల్న ? లేకుంటె అంత మంచికి గిన్ని పడువాట్లెందుకు ? దేవునికి దెల్వదా ? పాపం అంట, అనడా? యాది కుదరకపోతె కాలం అన్నిటికి మిన్న, దాని ముందు తలొంచని రాజెవ్వడు? ప్యాద ఎవడు ? అంట సముదాన పడాల్న? ఇంగ సంపినోణి పాపం వూకెవో తాది, పిల్ల పిల్ల తరానికి దగుల్తది, పోలీసుకు దొర్కితె మట్కు వురి దీస్తరంటరు, అయితే సచ్చిన శీను లేసి వొస్తడ ? అందుట్ల సాయమ్మకు దక్కేదేంది? తేల్చుండి.